తెలుగు కళాసమితి న్యూజెర్సీ ఉగాది కథల పోటీలో రూ. 300లు బహుమతి పొందిన కథ

# పడవ విడచిన రేవులు

శైలజ ముఖంలో ఆనందం లేదు. అలాగని అయిష్టమూ లేదు పూర్తిగా భావరహితంగా వుంది. కుటుంబరావుకి కూతురు మనస్సు అర్థంకావడం లేదు. ఈమధ్య ఆమె ప్రవర్తనే చిత్రంగా వుంది విడివడని చిక్కుముడిలా కనిపిస్తోంది.

''నేను చెప్పింది సరిగ్గా విన్నావా శైలజా? వినకపోతే మళ్ళీ చెప్తాను!'' అన్నాడు కుటుంబరావు.

''విన్నాను నాన్నా! పెళ్ళికొడుక్కి నన్ను చేసుకోవడం ఇష్టమేనని ఉత్తరం వచ్చింది. కట్నకానుకల విషయం మాట్లాడుకుందుకు త్వరగా రమ్మని రాసి వుంటారు! అయినా నీ కెందుకు నాన్నా ఈ తాపత్రయం! వెంటనే పెళ్ళి చేస్తావా లేదా అని నేనేం నీ పీక మీద కూర్చోలేదే!'' అన్నది శైలజ.

''అదేవిటమ్మా! నువ్వడగలేదని చేతులు ముడుచుక్కూచోమంటావా నన్ను! ఇప్పటికే పెన్షన్‌గాణ్ణని నా మాట వినకుండా, నన్నో మూల కూచోబెట్టి నీ తరవాత దాని పెళ్ళి జరిపించావ్! ఇప్పుడేమో చిన్నదానికి సంబంధాలు వెతికిస్తున్నావు. పెద్ద పిల్లవి నువ్వు! నువ్వో ఇంటిదానివి కాకుండా చిన్న పిల్లలకి పెళ్ళి చేస్తున్నందుకు నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడుతున్నారు నా వెనకాల!'' అన్నాడు కుటుంబరావు బాధపడుతూ.

''చూడు నాన్నా! అలా మాట్లాడే వెధవ లెవరూ మన బాధల్లో పాలుపంచుకోరు. పైసా సాయపడరు. అలాటి రాతి మనుషులతో మనకేం పని చెప్పు! మన సమస్యలేవో మనవే! అవి ఒకళ్ళు తీర్చేవి కావు. మనకి తోచినట్టు మనమే పరిష్కరించుకోవాలి. అసలు నా పెళ్ళికి ఇప్పుడేం తొందరొచ్చింది? ఇంకా నాకు ఇరవయ్యేడేగా? పెళ్ళి వయస్సు దాటిపోలేదు. నేనే కొడుకునైవుంటే నువ్వీ మాట అనవుగా! ఆడపిల్లని గదాని చిన్నచూపు చూడ్డం న్యాయం కాదు నాన్నా! కొడుకులాగే పెంచేవు! డిగ్రీ చెప్పించావు. మంచి ఉద్యోగం వేయించావ్! నీ బాధ్యతల బరువుని నన్నూ మొయ్యనివ్వు! చిన్న చెల్లి పెళ్ళి కూడా అయిపోతే అప్పుడు తీరిగ్గా నా సంగతి ఆలోచిద్దువుగానీ!'' అన్నది శైలజ.

''దానికి సంబంధం కుదరడం అంత తేలికేం కాదు శైలూ!'' అన్నాడు కుటుంబరావు నిరాశతో.



శైలజ సన్నగా నవ్వుతూ, ''దాన్ని ఇష్టపడిన కుర్రాడు సిద్ధంగా వున్నాడు నాన్నా! అది టైపు నేర్చుకునే ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ అర్జునరావు నా దగ్గరికి చాలాసార్లు వచ్చాడు. చిన్ని అభిప్రాయం అడిగి తెలుసుకున్నాను. అతనంటే దానికీ ఇష్టమే! కులాంతరం అని నువ్వు వ్యతిరేకించకపోతే, చిన్ని పెళ్ళి వెంటనే చేసెయ్యొచ్చు!'' అన్నది.

కుటుంబరావు తెల్లబోయేడు. చిన్నిని కులంగాని వాడికిచ్చి చెయ్యాలన్న నిర్ణయానికి వచ్చేసిందా శైలజ? లోకం ఏమంటుందోనన్న భయం కూడా లేదా? ఈ పెళ్ళంటూ జరిగితే రేపు శైలజని చేసుకోడానికి ముందుకెవడైనా వస్తాడా? ఒకవేళ రాకపోతే అవివాహితగా, ఉద్యోగం చేస్తూ కాలక్షేపం చేస్తుందా?

''నాన్నా! నీ ఆలోచన లేవిటో నాకు తెలుసు! అర్జునరావు, చిన్ని పరస్పరం ప్రేమించుకున్నారు. కులం పేరుతో వాళ్ళని విడదీస్తే అమానుషం అనిపించు కుంటుంది. అంతకంటే మించింది మరో విషయం — మన స్థితిగతులను బట్టి, ఆ కుర్రాణ్ణి కాదని, వేలకి వేలు కట్నాలు పోసి వేరే సంబంధం తేలేం! నా మాట విను నాన్నా! కులం కన్నా వాళ్ళ సుఖం ముఖ్యం!'' అన్నది శైలజ.

కుటుంబరావు చాలా సేపు ఆలోచించేడు. శైలజ మాటల్లోని వాస్తవాన్ని కాదనలేక పోయేడు. నాటికీ నేటికీ సమాజం చాలా మారింది. మారుతోంది. ఇంకా ఇంకా మారిపోతుంది. మారుతున్న పరిస్థితులకు తలవంచాలి, తప్పదు అనుకున్నాడు. అలాగే తల వంచాడు. పెద్ద కూతురు శైలజ ముందుచూపుకీ, ప్రయోజకత్వానికీ ముగ్ధుడయ్యాడు.

*

ఇంటి ముందు స్కూటర్ ఆగిన చప్పుడు విని తలెత్తి చూసేడు కుటుంబరావు. స్కూటర్ దిగి, దింపిన యువకుడికి చెయ్యి వూపి గుమ్మంలోకి నడిచింది శైలజ.

''ఎవరమ్మా అతను?'' అడిగేడు కుటుంబరావు.

''నా కొలీగ్ నాన్నా! పేరు గంగాధర్! వామనరావుగారని పెద్ద కంట్రాక్టర్! నువ్వు వినేవుంటావ్! ఆయన కొడుకు!'' అన్నది శైలజ.

''అలాగా! అంత డబ్బున్నవాడికి ఈ చిన్న క్లర్కు ఉద్యోగం చెయ్యాల్సిన కర్మేవిటమ్మా?'' అనడిగేడు కుటుంబరావు.

''అదే నాన్నా, గంగలో స్పెషాలిటీ! వాళ్ళ నాన్న ప్రజల్నీ, ప్రభుత్వాన్నీ, శ్రామికుల్నీ దోచి సంపాదించడం అతనికి అసహ్యం! తండ్రి నెప్పుడూ విమర్శిస్తూనే వుంటాడు. అతనిష్టపడితే రోజూ కార్లో ప్రిన్స్‌లా తిరగొచ్చు! ఆ ఆడంబరాలు అతనికి గిట్టవు! ఆ స్కూటరైనా లోను తీసి కొనుక్కున్నదే! ఇన్‌స్టాల్‌మెంట్స్ ఇంకా కడుతున్నాడు'' అన్నది శైలజ.

కుటుంబరావు కూతురి ముఖంలోకి పరిశీలనగా చూసేడు. అక్కడ అతనికి ఏదో వెలుగు, కళ్ళల్లో ఏదో మెరుపు, చెక్కిళ్ళపై మను సిగ్గులూ, పెదవులపై చిరునవ్వూ కలబోసి కనిపించేయి.

శైలజ మనస్సుని తండ్రిగా కుటుంబరావు గ్రహించాడు. అంతలో అతనిలో ఏదో దిగులు! శైలజ మనోరథం నెరవేరుతుందా?

కుటుంబరావులో ఎన్నో అనుమానాలు!

*

వామనరావుగారు తనతో ఏం మాట్లాడాలని తన ఆఫీసుకి పిలిపించాడో అర్థంగాక, తడబడే అడుగులతో ఆయనగారి రూంలోకి వెళ్ళింది శైలజ.

''కూర్చో శైలజా! మా గంగాధర్ నీ గురించి చాలా గొప్పగా చెపుతూ వుంటాడు. నువ్వు గొప్ప ప్రయోజకురాలివట! ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశావట! మీ నాన్నకి కొడుకుల్లేని లోటు కనపడకుండా బాధ్యతలన్నీ మోస్తున్నావట... ఏమేమిటో చాలా చెప్పాడు'' అన్నాడు వామనరావు. ఆయన మాటల్లో వ్యంగ్యం తొంగిచూస్తోంది.

శైలజ ఇబ్బందిగా కదిలింది కుర్చీలో.

''మావాణ్ణి ప్రేమించావటగా! నువ్వేమిటి? వాణ్ణి ఈ మహానగరంలో వున్న పెళ్ళిగాని ఆడపిల్లలందరూ ప్రేమిస్తూనే వున్నారు. ఎందుకంటే వాడి వెనక లక్షలాది ఆస్తిపాస్తులున్నాయి. బ్రహ్మాండమైన వ్యాపారాలున్నాయి. ఇంతకంటే మీలాంటి మధ్య తరగతి ఆడపిల్లలు ప్రేమించడాని కింకేం కావాలి చెప్పు! అది సరేగానీ, ప్రేమించే ముందు వాడి ఖరీదెంతో తెలుసుకున్నావా? తెలుసుకోకపోతే, నీ స్తోమతేమిటో ఇప్పుడు చెప్పు పోనీ! మా గంగని ఎంతిచ్చి కొనుక్కోగలవు?'' అని అడిగేడు వామనరావు.

శైలజ, వామనరావు వైపు నిప్పులు కురిపిస్తున్నట్టు చూసింది. ఆమె కళ్ళల్లో జుగుప్స.

''వామనరావుగారూ! గంగ తన రేటెంత అని నాకు ఎప్పుడూ చెప్పలేదు. అంచేత నా స్తోమతు గురించి పరిశీలించుకోలేదు. బహుశా మీ దృష్టిలో యువతీ యువకులు ప్రేమించుకోవడానికి అందచందాలూ, ఆస్తి - అంతస్తులూ, పెద్ద ఉద్యోగపు హోదాలూ

కారణాలు కావచ్చు. అందుకే గంగ వెనక అవన్నీ వున్నాయని చెప్పగలిగేరు. వాటిని ఎర చూపించి మీరతన్ని సంతకి తోలుకెళ్ళి బేరం పెట్టగలరేమోగానీ, నేనంత హీనస్థితికి దిగజారిపోయేదాన్ని కాదు. నేను హృదయ జీవిని. తన అభిప్రాయాలతో, ఆశయా లతో, నిరాడంబరమైన ప్రవర్తనతో, నా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నా మనస్సుని కదిలించాడు గంగ! కరిగించాడు. మీకున్న అహంకారాలూ, వ్యాపార దృష్టి అతనిలో ఏ కోశానా లేవు. మీరూ, మీ డబ్బూ, మీ అహంకారం పెంచుకొస్తున్న ఈ దరిద్రపు వ్యవస్థ తాలూకు మురికి అంటని స్వచ్ఛమైన మనిషి. నాలాగే, హృదయజీవి. నా ప్రేమ అతనికి తెలుసు! మీకున్న అంగబలంతో, అర్థబలంతో నన్ను అతని నుంచి దూరంగా తరిమేసినా, నేను ఆర్తిగా ఎక్కణ్ణుంచి పిలిచినా అన్ని సంకెళ్ళూ తెంపుకుని వచ్చేస్తాడు. అంత విశ్వాసం నాకు నా గంగ మీద! మీ తరం వేరు వామనరావుగారూ! మీరు కులాలూ, మతాలూ, ఆస్తులూ, అంతస్తులూ అని ఊగులాడుతుంటారు. అవిపోయిన మరుక్షణం గుండెలు అవిసిపోతాయి మీకు! మీ జీవిత గమనం నిలి పోతుంది. మా తరం వేరండీ! అన్ని అడ్డంకులూ అధిగమించి, గమ్యం చేరతాం నిరంతర పోరాటం సాగిస్తాం! మేం కోరుకున్న ప్రపంచాన్ని నిర్మించుకుంటాం!'' అన్నది శైలజ ఆవేశంగా.

వామనరావు నిర్ఘాంతపోయి చూస్తున్నాడు.

అప్పుడే లోపలికి వచ్చేడు గంగాధర్.

''డాడీ! శైలూ మాటలన్నీ విన్నాను. ఆమె ఎలాంటి మనిషో మీ కర్థమైవుంటుంది. ఆమెని నే నెందుకింతగా ఆరాధిస్తున్నానో గ్రహించే వుంటారు. అలా జరగకపోతే అది మీ దురదృష్టం! మీ రెంత గింజుకున్నా, మేము మా మార్గంలో వెళ్ళేతీరతాం! మీరు వున్నచోటే వుండండి. నావ విడిచిపెట్టి వెళ్ళిపోయిన రేవుల్లాగా బావురుమంటూ మిగిలిపోవడం మీ తరం మనుషుల నైజం! శైలూ! కమాన్! లెటజ్ గెటౌటాఫ్ దిస్ హెల్!'' అంటూ గంగాధర్ శైలజ చెయ్యి అందుకున్నాడు.

ఇద్దరూ చేతిలో చెయ్యి వేసుకుని బైటికి నడిచారు.

ఆ గదిలో నిశ్శబ్దం ఘనీభవించినట్టుంది.

*

మంచి రచయిత ఎప్పుడూ పాఠకుడికన్నా ముందు వుండాలిగానీ, పాఠకుడికన్నా వెనుకబడి వుండకూడదు. పాఠకుడు వెనక్కి తిరిగి, రచయితని చూసి వెక్కిరింతగా నవ్వి — 'ఏమిటి ఇలా రాశావు?' అనే పరిస్థితి తెచ్చుకోకూడదు. అంటే, పాఠకుడు రచయితనేమీ ప్రశ్నించకూడదనీ, రచయిత పాఠకుడి నించి ఏమీ నేర్చుకోకూడదనీ అర్థం కాదు. పాఠకుడి నించీ నేర్చుకోవలసిందంతా రచనకు ముందేగానీ తర్వాత కాదు. తర్వాత నేర్చుకోవలసింది చిన్న చిన్న సవరింపులే కాని, సమాజం నించి ప్రధానంగా నేర్చుకోవలసింది రచనకు ముందే.

— రంగనాయకమ్మ

సేకరణ: తవుటు నాగభూషణం